క్లుప్తంగా

వ్యర్థాల తొలగింపు



జేసీబీతో వ్యర్థాలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

పహాడీషరీఫ్: బక్రీద్ సందర్భంగా పోగైన ఖుర్బానీ వ్యర్థాలను జల్‌పల్లి మున్సిపల్ అధికారులు తొలగిస్తున్నారు. గురువారం మధ్యాహ్నం నుంచి మొదలైన ఈ ప్రక్రియ శుక్రవారం సైతం సాగింది. మున్సిపాలిటీకి చెందిన ట్రాక్టర్లకు అదనంగా టిప్పర్లలో వ్యర్థాలను తొలగిస్తున్నారు. కొత్తపేట, సలాల, ఎర్రకుంట, షాహీన్‌నగర్, ఉస్మాన్‌నగర్, బిస్మిల్లా కాలనీ, క్యూబా కాలనీ, అలీ నగర్, వాదే ముస్తఫా, వాదే సాల్హె హీన్, పహాడీషరీఫ్ తదితర బస్తీలలో చెత్త పాయింట్ల వద్ద పడుతున్న వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నారు. మున్సిపాలిటీ చైర్మన్ అబ్దుల్లా సాది, కమిషనర్ ఎస్.వసంతలు ఎప్పటికప్పుడు తొలగింపు డ్రైవ్‌ను పరిశీలిస్తున్నారు. వ్యర్థాల తొలగించిన ప్రదేశాలలో దుర్వాసన తలెత్తకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్నారు.

2023-24 పాలిటెక్నిక్ తరగతులు

మహేశ్వరం: మోడల్ స్కూల్ హాస్టల్ భవనంలో 2023-24 సంవత్సరానికిగాను పాలిటెక్నిక్ తరగతులు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ భవాని శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. వచ్చే విద్యా సంవత్సరం వరకు ఐదెకరాల స్థలంలో రూ.15 కోట్ల నిధులతో కళాశాల భవనం నిర్మించనున్నట్లు ఆమె వివరించారు. కళాశాలకు 64 మంది అధ్యాపకులు, సిబ్బంది పోస్టులు మంజూరయ్యాయని తెలిపారు.

జీపీ భవన నిర్మాణాలకు రూ.80 లక్షలు మంజూరు

మహేశ్వరం: మహేశ్వరం, కందుకూరు మండలాల్లోని నందుపల్లి, గంగారం, అన్నోజిగూడ, బేగరి కంచె గ్రామ పంచాయతీలకు నూతన భవనాలు మంజూరయ్యాయి. ఎన్ఆర్‌జీఈఎస్ కింద రూ. 80 లక్షలు విడుదల చేస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఒక్కో గ్రామ పంచాయతీకి రూ. 20 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయి. నిధులు మంజూరయ్యేలా కృషి చేసిన మంత్రి సబితారెడ్డికి ఆయా గ్రామాల సర్పంచ్‌లు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం సమర్పిస్తున్న కార్పొరేటర్ ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

చైతన్యపురి: విద్యుత్ సంబంధిత సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గడ్డిఅన్నారం కార్పొరేటర్ ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి శుక్రవారం సరూర్‌నగర్ ఎలక్ట్రికల్ డీఈకి వినతిపత్రం సమర్పించారు. కొన్ని కాలనీల్లో నూతన కేబుల్ వైర్లు ఏర్పాటు చేయాలని, పాత కాలం నాటి లైన్లు లూజ్ కనెక్షన్‌లు ఉండటం, చెట్టు భవనాల మధ్య ఉండటం వల్ల సమస్యలు ఏర్పడుతున్నాయని వివరించారు. నూతన విద్యుత్ స్తంభాలు అవసరమైన ప్రాంతాల్లో వేయాలని కోరారు. వీలైనంత త్వరగా పనులు చేపట్టి డివిజన్‌లో విద్యుత్ సమస్యలు లేకుండా చేయాలని కార్పొరేటర్ కోరారు.

న్యాయవాదుల సాంస్కృతిక సమ్మేళనం

రంగారెడ్డి కోర్టులు: న్యాయవాదుల పరస్పర సహకార సంఘం ఆధ్వర్యంలో శనివారం నాగోల్ శుభమ్ కన్వెన్షన్‌లో న్యాయవాదుల వార్షిక సంస్కృతిక సమ్మేళనం నిర్వహించనున్నట్టు సంఘం ఉపాధ్యక్షురాలు సునీత బర్ల తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ.. సంఘం ఏర్పాటు తరువాత ఇది 12వ వార్షిక సాంస్కృతిక కార్యక్రమంగా వారు పేర్కొంటూ న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గని కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమానికి హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ విజయ్‌సేన్ రెడ్డి, మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు సంఘం సంచాలకులు డా. బాచిరెడ్డి శాయిరెడ్డి, కె యాదగిరి రావు తెలిపారు.

అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

ఎల్‌బీనగర్: డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ లచ్చిరెడ్డి అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని ఆఫీసర్స్ కాలనీలో జరుగుతున్న రోడ్డు పనులను డీఈ దామోదర్‌రావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాలనీలో ప్రజలకు అతిత్వరలోనే మంచి నీటి పైపులైన్‌తోపాటు డ్రైనేజీ సమస్యను కూడా పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు మహేశ్, బాలనర్సింహ, వర్క్‌ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

హరితోత్సవానికి సర్వం సిద్ధం



తుమ్మలూరు నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

- మండలంలో లక్ష మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు
- వర్షాలు కురవడమే తరువాయి
- ఇప్పటికే 42 వేల గుంతలు తీయించిన అధికారులు

మహేశ్వరం: హరితహారం కార్యక్రమంలో భాగంగా మండలంలో మొక్కలు నాటేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఇటీవల సీఎం కేసీఆర్ మండలంలోని తుమ్మలూరు గ్రామంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా హరిత హారం కింద మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో తొమ్మిదో విడత హరితహారంలో మొక్కలు నాటేందుకు ఉపాధి హామీ పథకం ద్వారా సుమారు 3.50 లక్షల మొక్కలను పెంచుతున్నారు. ప్రతి గ్రామంలో

లక్ష మొక్కల లక్ష్యం

మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో హరితహారం కార్యక్రమం కింద లక్ష మొక్కలు నాటాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో 3,500 మొక్కలు నాటాలని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. వర్షాలు సమయానికి కురవక పోవడంతోనే మొక్కలు నాటడం ఆలస్యం అయ్యిందని అధికారులు అంటున్నారు. ఇప్పటికే 42 వేల గుంతలను తీశారు. వర్షాలు పడగానే మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. గ్రామ పంచాయతీల్లోని నర్సరీలలో పూలు, పండు, ఔషధ గుణాలు ఉన్న మొక్కలను పెంచుతున్నారు. కూలీలను పెట్టి ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకుంటున్నారు.



మహేశ్వరంలో నాటడానికి సిద్ధంగా ఉన్న మొక్కలు

ఏర్పాట్లు పూర్తి



మండలంలో మొక్కలు నాటేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశాం. వర్షాలు పడడమే ఆలస్యం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభిస్తాం. మహేశ్వరం గ్రామ నర్సరీలో 15 వేల పలు రకాల మొక్కలను అందుబాటులో ఉన్నాయి. ఒక్కో గ్రామ పంచాయతీలో 3,500 మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

– వజ్ర లింగం, పంచాయతీ కార్యదర్శి మహేశ్వరం

లక్ష మొక్కలు నాటుతాం



తొమ్మిదో విడతలో మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో లక్ష మొక్కలు నాటుతాం. ఇప్పటికే పలు గ్రామాల్లో గుంతలు తవ్వే పనులు పూర్తి చేశాం. నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. వర్షాలు పడగానే హరితహారం కార్యక్రమాన్ని ప్రారంభిస్తాం. అలాగే ప్రతి ఇంటికీ ఆరు మొక్కలు పంపిణీ చేస్తాం.

– నర్సింహ, ఎంపీడీఓ, మహేశ్వరం

మంత్రి సబితపై ఆరోపణలు హాస్యాస్పదం



సమావేశంలో మాట్లాడుతున్న కామేష్‌రెడ్డి

మీర్‌పేట: ప్రజాదరణ లేని వారు మంత్రి సబితా ఇంద్రారెడ్డిపై ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందని మీర్‌పేట కార్పొరేషన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మీర్‌పేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల పార్టీ మారిన కొత్త మనోహర్‌రెడ్డి అవకాశవాద రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. కార్పొరేషన్ ఎన్నికల్లో సొంత తమ్ముడిని గెలిపించుకోలేని మనోహర్‌రెడ్డి కోట్లాది రూపాయలతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న మంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైంది కాదన్నారు. మనోహర్‌రెడ్డి తీరు మార్చుకోకపోతే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ ఫ్లోర్ లీడర్ భూపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు లావణ్య, రాంచందర్, రవినాయక్, అరుణ, రాజేందర్‌రెడ్డి, నాయకులు దీప్‌లాల్ చౌహాన్, యాదగిరి ముదిరాజ్, సుదర్శన్, శేఖర్‌గౌడ్, నాగరాజు పాల్గొన్నారు.

కాలనీలోకి మురుగు రాకుండా చూడాలి



డీసీకి వినతిపత్రం అందజేస్తున్న దయాకర్‌రెడ్డి, కాలనీవాసులు

హుడాకాంప్లెక్స్: వాసవి బిల్డర్స్ నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్ స్థలాల నుంచి వస్తున్న వ్యర్థాలతో కూడిన మురుగునీరు తమ కాలనీ మీదుగా రాకుండా చర్యలు తీసుకోవాలని శంకర్‌నగర్ వాసులు సరూర్‌నగర్ సర్కిల్ ఉప కమిషనర్ హరికృష్ణయ్యకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు పారుపల్లి దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ కాలనీ ఏర్పడి సుమారు 30 సంవత్సరాలు దాటిందని బస్తీ వెనకాల గతంలో సిరీస్ కంపెనీ నడిచేదని, దానివల్ల వెలువడుతున్న వ్యర్థాల వల్ల చుట్టుపక్కల ప్రాంతాల్లో కాలుష్యం వల్ల కాలనీవాసులు ఇబ్బందులు పడ్డారని తెలిపారు. 20 సంవత్సరాల క్రితం కంపెనీ మూసివేయడంతో ఇప్పటివరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జీవనం సాగిస్తున్నామని తెలిపారు. ఇప్పుడు వాసవి కన్‌స్ట్రక్షన్స్ వారు అపార్ట్‌మెంట్లను నిర్మాణంతో మరలా సమస్య ఉత్పన్నమయ్యే అవకాశం ఉందని వివరించారు.

చదువుకు పేదరికం అడ్డు కావద్దు



విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేస్తున్న మీ నేస్తం ఫౌండేషన్ ప్రతినిధులు

పహాడీషరీఫ్: ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాల కల్పనకు స్వచ్ఛంద సంస్థలు సైతం ముందుకు రావాలని మీ నేస్తం ఫౌండేషన్ ప్రతినిధులు అన్నారు. మీ నేస్తం ఫౌండేషన్ ఏర్పాటు చేసుకున్న రాయదుర్గం ప్రభుత్వ పాఠశాల 1997–98 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు శుక్రవారం మామిడిపల్లి రంగ నాయకుల కాలనీలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలు, ఇతర స్టేషనరీ సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చదువుకు పేదరికం అడ్డు కారాదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారు ఉన్నత స్థానాలలో ఉన్నారని గుర్తు చేశారు. తమ వంతుగా పేద విద్యార్థుల సాయం కోసం ఈ ఫౌండేషన్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు లాల్ సతీష్ గౌడ్, వి.రాజు గౌడ్, రాజు రెడ్డి, గణేష్, ప్రవీణ్, సంగీత, ఉదయ శ్రీ, భాగ్యరేఖ, పావనీ, దుర్గాదేవి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి గురుపూర్ణిమ

చైతన్యపురి: దక్షిణ షిరిడీగా ప్రసిద్ధి చెందిన దిల్‌సుఖ్‌నగర్ సాయిబాబా ఆలయంలో ఆదివారం నుంచి మంగళవారం వరకు మూడు రోజుల పాటు గురుపౌర్ణమి మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ గుండ మల్లయ్య తెలిపారు. ట్రస్ట్ కమిటీ సభ్యులతో కలిసి శుక్రవారం ఆలయంలో ఉత్సవానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన ఉత్సవ వివరాలు వెల్లడించారు. భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయించటం జరిగిందన్నారు. వేలాది మంది భక్తులు బాబా దర్శనానికి వస్తుండటంతో పోలీస్ బందోబస్తు, ఆలయానికి వచ్చే భక్తుల కోసం పుల్లారెడ్డి స్కూల్ ఆవరణలో ప్రత్యేక పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ప్రత్యేక వలంటీర్లు, సాయి సేవకులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూస్తారని అన్నారు. సమావేశంలో ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి లక్ష్మీదుర్గ, ఆర్థిక కార్యదర్శి ఆర్ఎస్ శంకరరావు, ట్రస్ట్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రేపు గురుపూజోత్సవం

వనస్థలిపురం: వేదభూమి సంస్థ ఆధ్వర్యంలో గురుపూర్ణిమ సందర్భంగా ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు వనస్థలిపురంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురుపూజోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ ఆచార్యులు, కవి, పండితులు, చారిత్రక నవలా చక్రవర్తి డా.ముదిగొండ శివప్రసాద్‌ను సత్కరించనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి వేద భూమి సంస్థ ప్రతినిధులు, కవులు, కళాకారులు అందరూ హాజరు కావాలని వారు కోరారు.

మురుగు సమస్య పరిష్కరించండి

కార్పొరేటర్ శ్రీవాణి



జలమండలి జనరల్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న శ్రీవాణి

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్‌లో నెలకొన్న మురుగు సమస్యను పరిష్కరించాలని కోరుతూ కార్పొరేటర్ శ్రీవాణి శుక్రవారం జలమండలి జనరల్ మేనేజర్ బలరామరాజుని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండున్నర సంవత్సరాల నుంచి సరూర్‌నగర్ డివిజన్ మొత్తం ప్రజలతో కలిసి స్థానిక సమస్యల గురించి చర్చించానని, ముఖ్యంగా డివిజన్‌లో డ్రైనేజీ సమస్యను అరికట్టడానికి నాలుగు కేటగిరిలో విభజించడం జరిగిందన్నారు. రెండు రోజులకోసారి నిండే డ్రైనేజీ సమస్యపై స్థానిక ప్రజలు, సంబంధిత అధికారులతో చర్చించిన తర్వాత వీటికి కారణాలు కనుక్కోవడం జరిగిందని అన్నారు. మ్యాన్‌హోల్ ఛాంబర్ రిపేరు, గ్రావిటి ఇష్యూస్, పైపులైన్ లెవెల్స్ కలవకపోవడం, పైపులైన్ డ్యామేజ్, స్మాల్ డయా పైపులైన్, వీటితో పాటుగా కొన్ని తప్పిదాల వల్ల డ్రైనేజీ ఓవర్‌ఫ్లో అవుతోందని అన్నారు. ప్రత్యేక నిధులు మంజూరు చేసి మురుగు సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

3న బోనాల ఉత్సవ్ అవార్డుల ప్రదానం



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న అరవింద్ గౌడ్ తదితరులు

చాంద్రాయణగుట్ట: బోనాల వేడుకల్లో విశిష్ట సేవలు అందించిన ప్రముఖులకు శ్రీ మహాకాళి మహేష్ గౌడ్ బోనాల ఉత్సవ్ అవార్డులు --2023ను జూలై 3వ తేదీ రవీంద్రభారతి ఆడిటోరియంలో ప్రదానం చేయనున్నట్లు మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు జి.అరవింద్ గౌడ్, ప్రధాన కార్యదర్శి కె.వెంకటేష్‌లు తెలిపారు. అవార్డులకు సంబంధించిన బ్రోచర్‌ను శుక్రవారం లాల్‌దర్వాజాలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రాంతంలోనే వందల ఏళ్లుగా గోల్కొండ, సికింద్రాబాద్, లాల్‌దర్వాజా బోనాల ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ ఉత్సవాలను విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్న ప్రముఖులకు శ్రీ మహాకాళి మహేష్ గౌడ్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అవార్డులను అందజేయనున్నామన్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ శాసన మండలి చైర్మన్ బండా ప్రకాష్, డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్, మంత్రులు, పోలీస్ అధికారులు, లాల్‌దర్వాజా ఆలయ కమిటీ చైర్మన్ సి.రాజేందర్ యాదవ్ తదితరులు పాల్గొననున్నట్లు తెలిపారు.

బీజేపీతోనే ప్రజా సమస్యల పరిష్కారం

పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీరాములు యాదవ్



శ్రీరాములు పాదయాత్రకు మద్దతు తెలుపుతున్న ఇంద్రసేనారెడ్డి

బడంగ్‌పేట్: బీజేపీ అధికారంలోకి వస్తేనే ప్రజల కష్టాలు, సమస్యలు తీరుతాయని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జన్ సంపర్క్ అభియాన్ గడపగడపకూ పాదయాత్ర శుక్రవారంతో 9వ రోజుకు చేరుకుంది. బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడలోని వినాయక హిల్స్ కాలనీ ఫేస్-3లో ఇంటింటికి పాదయాత్ర సాగింది. కాలనీల్లో నెలకొన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే ఇంద్రసేనారెడ్డి పాదయాత్రలో పాల్గొని మద్దతు తెలిపారు. మోదీ తొమ్మిదేళ్ల పాలనలో దేశ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని పేర్కొన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో కాషాయ జెండాను ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్లు మాధురి, రమాదేవి, ఇంద్రసేనా, శ్రీధర్‌రెడ్డి, పద్మ, నాయకులు శ్రీకాంత్‌గౌడ్, శూరకర్ణారెడ్డి పాల్గొన్నారు.

పోరాటానికి సిద్ధమవ్వాలి



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్

అంగన్‌వాడీ ఉద్యోగులకు సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ పిలుపు

మహేశ్వరం: ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచకపోతే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దించడానికి అంగన్‌వాడీలు సిద్ధం కావాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్, అంగన్‌వాడీ టీచర్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన జీపు జాత ముగింపు సభకు వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వాలు ఐసీడీఎస్ శాఖకు కేటాయించాల్సిన బడ్జెట్‌ను కేటాయించకపోవడం, నూతన జాతీయ విద్యా విధానం ద్వారా ఐసీడీఎస్‌ను ఎత్తివేసే కుట్ర పన్నుతోందని ఆరోపించారు. బడ్జెట్‌లో కేటాయింపులు చేయడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న అంగన్‌వాడీలు లబ్ధిదారులు నష్టపోతున్నారని అన్నారు. 13 ఏళ్ల క్రితం ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సిఫారసు చేసి కనీస వేతనం అమలు చేయాలని కోరితే పాలక పార్టీలు అమలు చేయడం లేదని, సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చినా రాష్ట్రంలో గ్రాట్యుటీ ఇవ్వడం లేదన్నారు. పోషకాహార లోపం తగ్గాలంటే భజన చేయాలని దేశ ప్రధాని ప్రజలను మతం ఉచ్చులోకి లాగుతున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గించడం వల్లే నేడు కేవలం 60 శాతం నిధులతో ఐసీడీఎస్ అనేక సమస్యలతో నడుస్తోందన్నారు. ప్రభుత్వాలు స్పందించకపోతే పోరాటాల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలని వారు అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రమేశ్, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజు, చంద్రమోహన్, అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, ప్రధాన కార్యదర్శి కవిత, జిల్లా ఉపాధ్యక్షులు రవికుమార్, కిషన్, జగదీష్, రుద్రకుమార్, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

ఆశీర్వదిస్తే.. సేవకుడిలా పనిచేస్తా

- ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘువేందర్‌రెడ్డి
- నియోజకవర్గ పరిధిలో భారీ ర్యాలీ



కడ్తాల్: ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న సుంకిరెడ్డి

ఆమనగల్లు: ప్రజలకు సేవ చేసేందుకే మాతృభూమికి వచ్చానని.. వారు ఆశీర్వదిస్తే సేవకుడిలా పనిచేస్తానని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు సుంకిరెడ్డి రాఘువేందర్‌రెడ్డి అన్నారు. దేశ, రాష్ట్ర అభివృద్ధిని కాంక్షించి కాంగ్రెస్‌పార్టీలో చేరినట్లు ఆయన చెప్పారు. నాలుగు రోజుల క్రితం ఢిల్లీలో ఏఐసీసీ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేల సమక్షంలో టీపీసీసీ అధ్యక్షుడు ఎనముల రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘువేందర్‌రెడ్డి కాంగ్రెస్‌పార్టీలో చేరారు. కాంగ్రెస్‌లో చేరిన ఆయన తొలిసారి కల్వకుర్తి నియోజక వర్గానికి వస్తున్న సందర్భంగా ఆయనకు మద్దతుగా కడ్తాల మండలం ముచ్చర్ల గేటు నుంచి కడ్తాల, ఆమనగల్లు, నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ, కల్వకుర్తి వరకు కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఆమనగల్లు పట్టణంలో ర్యాలీలో సుంకిరెడ్డి రాఘువేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు సేవ చేయడానికి అమెరికా పౌరసత్వం వదులుకుని కల్వకుర్తి నియోజక వర్గానికి వచ్చానని చెప్పారు. ఏడాది కాలంగా ఐక్యత ఫౌండేషన్ పేరుతో నియోజక వర్గ ప్రజలకు అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన వివరించారు. ప్రజలకు మరిన్ని సేవలు అందించేందుకు, నియోజకవర్గ అభివృద్ధి కోసం కాంగ్రెస్‌లో చేరినట్లు ఆయిన వివరించారు. భవిష్యత్తులో ప్రజలు ఆశీర్వదిస్తే ప్రజల మధ్యే ఉంటూ సేవకుడిలా పని చేస్తామని సుంకిరెడ్డి హామీ ఇచ్చారు.

ర్యాలీ విజయవంతం

సుంకిరెడ్డి రాఘువేందర్‌రెడ్డికి మద్దతుగా నిర్వహించిన కాంగ్రెస్‌పార్టీ భారీ ర్యాలీ విజయవంతమైంది. ర్యాలీకి ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల నుంచి పెద్ద ఎత్తున కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. హైద్రాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై పెద్ద ఎత్తున హోర్డింగ్‌లు, స్వాగత తోరణాలు, పార్టీ జెండాలను ఏర్పాటు చేశారు. ర్యాలీలో పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి సందడి చేశారు. ర్యాలీలో కోలాటం, డప్పుకొమ్ములు, బ్యాండు వాయిద్యాలు, కళాకారుల ఆటపాటలు ఆకట్టుకున్నాయి. ఓపెన్‌టాప్ జీప్ నుంచి సుంకిరెడ్డి ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. ఆమనగల్లులో దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ, భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్, అమరవీరుల స్థూపం వద్ద సుంకిరెడ్డి నివాళి అర్పించారు. ర్యాలీలో రేవంత్ మిత్రమండలి రాష్ట్ర అధ్యక్షుడు ఆసిఫ్ అలీం, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పాలకుర్ల రవికాంత్‌గౌడ్, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అనిల్, పార్టీ నాయకులు ధనుంజయ, మహేశ్, శ్రీరాములు, పర్వతాలు, సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్, అభినవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రేణుల్లో 'ఐక్యత' జోష్

కడ్తాల్: ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు సుంకిరెడ్డి రాఘువేందర్‌రెడ్డికి శుక్రవారం మండల కేంద్రంలో అభిమానులతో పాటు, పార్టీ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. కడ్తాల్ నుంచి కల్వకుర్తి నియోజకవర్గ కేంద్రం వరకు ర్యాలీ చేపట్టారు. కడ్తాల్ మండల కేంద్రానికి విచ్చేసిన రాఘువేందర్‌రెడ్డికి పార్టీ శ్రేణులు గజమాలతో స్వాగతం పలికారు. ముచ్చర్లగేట్ నుంచి తలకొండపల్లి చౌరస్తా వరకు, టపాసుల మోతతో, మహిళల, యువకుల నృత్యాలతో హోరెత్తించారు. మైసిగండి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రవికాంత్‌గౌడ్, సర్పంచ్‌లు శంకర్, పాండునాయక్, మాజీ సర్పంచ్ శ్రీరాములు పలు గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.